# దళితగోవిందం !

వేసవి సెలవుల్లో ఏటా మా అంకుల్ వాళ్ల విలేజికి వెళ్లటం అలవాటు!

అది పెద్దవూరేం కాదు. మొత్తం కలిపితే పదివేల గడపవుంటుంది. ఆ గ్రామంలో రెడ్లు... నాయుళ్ల ప్రాబల్యం ఎక్కువ. బ్రాహ్మణుల ఇళ్లు వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. ఆ గ్రామంలో అందరిదీ వ్యవసాయమే. మోతుబరులు అరడజను మంది వున్నా మిగతా వారంతా సన్నకారు చిన్నకారు రైతులే!

దళిత వర్గాల వారు గ్రామానికి దూరంగ గుడిసెలు వేసుకుని వుంటారు. వారంతా కలసి రెండు మూడు వందల మంది దాకా వుంటారు. అంతా కూలీనాలీ చేసుకుని బ్రతుకు ఈడుస్తున్నవారే!

మా అంకుల్ ఆవూళ్లో ఆర్.ఎమ్.పి. డాక్టర్. మంచి ప్రాక్టీసుంది! బాగానే సంపాదిస్తున్నాడు. అంకుల్‌కి ఒక్కడే కొడుకు. నాకంటే ఏడాది చిన్న.

నేను సిటీలో ఉంటున్న వాడిననీ... చదువులో మంచి మార్కులు తెచ్చుకుంటూ వుంటాననీ వాళ్ల వూరెళ్లినప్పుడల్లా 'అన్నయ్య.. అన్నయ్య.' అంటూ నా వెంటే వుంటాడు. కబుర్లు చెప్పమని వేధిస్తుంటాడు. క్రికెట్ ఆట చేతనవునా అంటాడు.టి.వి. చూస్తావా... ఎప్పుడైనా ఫోన్లో మాట్లాడావా అంటూ అమాయకంగా ప్రశ్నిస్తూంటాడు. వాళ్ల గ్రామంలో ఇలాంటి వేమీ లేక పోవడం వలన తెల్సుకోవాలని వాడి సరదా!

అంకుల్ ఇంట్లో వున్న పది పదిహేను రోజులూ ఇద్దరికీ ఒకే కంచం! ఒకే మంచం అన్నట్టుగా కల్సిపోయివుంటాం!

ఆ వూళ్లో బాగా డబ్బున్న వాళ్ల ఇళ్లల్లో సైతం టి.వి.గాని టెలిఫోన్ సౌకర్యం లేక పోవటం విడ్డూరమన్పించింది.

అంకుల్ వాళ్ల వూరు వెళ్లాలంటే రోడ్డు మీద బస్సు దిగి అయిదు మైళ్లు మట్టిరోడ్డుపై నడుచుకుంటూ వెళ్లాలి! వర్షాకాలం బురదతో రొచ్చుగా వుంటుంది. అక్కడి వారు రెండెడ్ల బళ్లమీదే ప్రయాణం. కుర్రకారుకి సైతం స్కూటర్లు గాని... మరే యితరమైన టూ వీలర్స్ లేవు.

గ్రామంలో కూడా అన్నీ మట్టి రోడ్లే. తారు రోడ్లకి నోచుకోని వూరది!

ఆ వూళ్లో రెడ్లది... నాయుళ్లదే పైచేయి కావటం మూలాన... వారు చెప్పేదే వేదం! కాదని ఎదురు చెప్పగల దమ్ము ఎవరికీ వుండదు.

మా అంకుల్ అంటే గ్రామస్థులందరికీ ఎనలేని గౌరవం! అనవసరమైన విషయాల జోలికి పోడు.

హరిజన వాడకి సైకిలు మీద వెళ్లి వైద్యం చేసి వస్తుంటాడు. వాళ్ల వేపు మిగతా గ్రామస్థులెవరూ కన్నెత్తైనా చూడరు. పొలం పన్లకి మాత్రం వారు అవసరపడతారు.. అంతే!

ఆవూరిలో పురాతనమైన వేణుగోపాల స్వామి వారి ఆలయముంది. వేయి సంవత్సరాల నాటిదని చరిత్ర చెబుతుంది. అలనాటి శిలాఫలకాలు నేటికీ దర్శనమిస్తుంటాయి.

ఆలయ శిల్ప సంపదను వూరిపెద్దలంతా బహు జాగ్రత్తగాకాపాడుకుంటూ వస్తున్నారు. అలనాటి కట్టడాలు శిథిలమైపోకుండా జాగ్రత్త వహించటం గొప్ప విశేషం.

ఆలయ ప్రహారీకి నాలుగు వైపులా పెద్ద పెద్ద మండపాలున్నాయ్. పిల్లలు పెద్దలు సాయంకాలం వేళ మండపాలమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ కన్పిస్తారు.

గుడి చుట్టూర పున్నాగి చెట్లు వంద ఏళ్లనాటివి దర్శనమిస్తాయ్.

పున్నాగి పూలతో నేను నా తమ్ముడు నోటితో వూదుతూ సన్నాయి వాయిస్తూ ఎంజాయ్ చేస్తూంటాము.

అంకుల్ వాళ్ల వూరికి వెళ్లగానే స్నానం చేసి వేణుగోపాల స్వామి గుడికి తమ్ముడిని తోడు తీసుకుని వెళ్లి స్వామివారిని దర్శించి హారతి కళ్లకు అద్దుకుని తీర్థ ప్రసాదాలు పుచ్చుకోవటం నా అలవాటు!

మిట్ట మధ్యాహ్నం సూర్యుడు నడి నెత్తికి వచ్చేదాకా ఆలయ ప్రాంగణంలో ఆకలనేదే తెలీకుండా అలిసిపోయేట్టు ఆడుకోవటం ఓ సరదా! అసలు సమయమే తెల్సేది కాదు.

గుడి వెనుక వైపు పెద్ద చెరువొకటుంది. గ్రామంలో వారంతా ఆ నీటిని తాగటానికి వంటకి వార్పుకీ వాడతారు. చెరువులో పశువులు దిగరాదని... ఈత కొట్టకూడదని...గొడ్లని కడుగవీలులేదని.. బట్టలు వుతకరాదని... ఇంకా సవాలక్ష అంక్షలున్నాయ్.

గ్రామస్తులు కావిళ్లతో చెరువునీళ్లు ఇళ్లకి తీసుకెడుతూంటారు.

ఆడవాళ్లు తడి బట్టలు కట్టుకుని తెల్లగ తోమిన ఇత్తడి బిందెలతో చెరువు దగ్గరకొచ్చి ముచ్చట్లు చెప్పుకుంటూ నీళ్ల బిందెలను నడుము మీద పెట్టుకుని బారులుతీరి నడిచి పోతూంటే... ఆ సన్నివేశం చూడటానికి రెండు కళ్లూ చాలవన్పిస్తుంది.

గ్రామ శివార్లలో పంటకాలవొకటుంది. పంట పొలాలకి అందులో పారేనీరే ఆధారం! బహిర్భూమికి ఆడ మగ పిల్లా పెద్ద చెరువు గట్టుకు పోవాల్సిందే.

బాగా బలిసిన అయిదారుగురు మోతుబరి రైతుల ఇళ్లల్లో మాత్రం సెప్టిక్ టాంక్ కక్కసు దొడ్లు కట్టించుకున్నారు.

అంకుల్ వాళ్లింట్లో కూడా లెట్రిన్ సదుపాయం వుండబట్టి సరిపోయింది. లేకపోతే చెంబు చేత పట్టుకుని చెరువు గట్టుకు పోవాలంటే మాత్రం నా వల్ల కాదు. సిగ్గుతో చచ్చిపోవాల్సి వచ్చేది.

పొలాలు కాలవగట్లే పబ్లిక్ టాయ్‌లెట్స్! పురుషులు స్త్రీలు వేరు వేరు దిక్కుల వేపు వెడతారు.

హరిజన వాడలో వాళ్లు గ్రామంలో వున్న మంచినీటి చెరువు నీళ్లు వాడుకునేటందుకు ఇప్పటికీ వీల్లేదు. వారికోసమని పంచాయితీ వాళ్లు వేయించిన బోరులో వచ్చే ఉప్పునీరే అన్ని అవసరాలకు వాడుకోవలసిందే. నీరు ధారాళంగా ప్రవహించే రోజుల్లో కుండలతో కాలవ నీళ్లు తెచ్చుకు తాగటం వాళ్లకి అలవాటైంది.

ఈనాటికీ అస్పృశ్యత అక్కడ కరాళనృత్యం చేస్తూండటం విడ్డూరంగానే వుంటుంది. గుడిసె వాసులైన హరిజనులు గ్రామస్తులు దృష్టిలో నేటికీ సాటి మనుషుల లెక్కకిందికిరారు.

హరిజనవాడలో నివసించే వారి మధ్య సఖ్యత లేదు. హక్కుల కోసం పోరాడగల గుండె ధైర్యం కానరాదు.

గ్రామ పెద్దల మాటంటే ఈ నాటికీ శిలాశాసనమే! హరిజనులు తోక ఝాడిస్తే గుడిసెలు పరశురామ ప్రీతే!

ఎలక్షన్లు వస్తే మాత్రం హరిజన వాడలో వున్న అంటరాని వారు గుర్తొస్తారు. వాళ్ల ముఖాన ఓ వంద విసిరేస్తారు. ఓ సారా సీసా అందిస్తారు. వారి దప్పిక తీర్చి నాయకులు వాళ్ల పబ్బం గడుపుకుంటారు. వారి అవసరం తీరేక తిరిగి మళ్లీ హరిజనుల ముఖం కూడా చూడరు. వారిపట్లఎవరికీ దయా దాక్షిణ్యాలు జాలీ లేవు.

పొలం పనులకు మాత్రం వారు కావాలి. దబాయించో... బూతులు తిట్టో పిలిపించు కుంటారు. ఆడ మగ వెట్టి చాకిరీ చేస్తే కాసిని గింజలు కొలిచి పాతికో పరకో ముఖాన విసిరేస్తారు. కాదూ కూడదని మొండికేస్తే రెడ్డిగారు విడిచిన పాతపంచో... రెండమ్మ కట్టి తీసేసిన పాత చీరో ఆడవారి ముఖాన కొడతారు. ఇంతోటి దానికే వాళ్ల ముఖాలు వికసిస్తాయ్! సంబరపడిపోతారు. అంతటి అల్పసంతోషులు!!

ఆ వూళ్లో హైస్కూలులేదు. చదువు కోవాలంటే కోసెడు దూరం పోవాల్సిందే! పొలాల గట్ల వెంట అడ్డదారిన నడిచో.. వున్న కుర్రకారు సైకిళ్ల మీదో వెళ్లి చదువుకుంటారు.

హరిజన వాడలో పిల్లల వంటిన ఎప్పుడూ చిరిగిన బట్టలే దర్శనమిస్తాయ్.

డా॥ అంబేద్కర్ వంటి మహనీయుడు మళ్లీ మళ్లీ గుడిసెల్లో జన్మిస్తే బావుండు అన్పిస్తుంది.

నేను రాజకీయాల్లోకి దిగితే... వీరి చరిత్రను తిరగవ్రాస్తాను బ్రతుకులు బాగుపడేందుకు అహర్నిశలు శ్రమిస్తాను.

అది జరిగేరిగేపని కాదు కదాన్పిస్తుంది!

★★★★★

వేణుగోపాల స్వామి వారి కళ్యాణోత్సవం ప్రతిఏడూ గ్రామస్తులంతా చందావేసుకుని ఘనంగా జరిపించటం ఆనవాయితీ! రథోత్సవానికి గ్రామస్తులంతా కలిసికట్టుగా వస్తారు. తలా ఒక చేయి వేసి రథాన్ని లాగుతూ నాలుగు వీధులూ వూరేగిస్తారు.

హరిజన వాడలో పిల్లలూ పెద్దలు దూరంగ నిలబడో.. రోడ్డుకి ఇరువైపులా వుండే చింత

చెట్లు ఎక్కి కొమ్మల సందుల్లో నుంచో స్వామి వారిని దర్శించి నమస్కరించి హారతి దూరం నుంచే కళ్లకి అద్దుకుంటూ వుంటారు.

హరిజనులకు అనేక సంవత్సరాలుగ ఆలయ ప్రవేశం నిషిద్ధం!

రథోత్సవం రోజున హరిజనుడెవడైనా అందరి మధ్యన పొరపాటునైనా కన్పించినా ఆరోజుతో వాడికి ఆయుష్షు తీరినట్టే! అది ఆవూరి కట్టుబాటు.

ఎంత దారుణం? హరిజనులు మాత్రం మనుష్యులు కారా?-దైవాన్ని పూజించుకునే హక్కు వారికి మాత్రం వుండదా? - అగ్రకులాల వారు ఏర్పరచిన కట్టుబాట్లు హేయమైనవి కావా? - హరిజనోద్ధరణకు జాతిపిత గాంధీ నడుము బిగించలేదా?

డా॥ అంబేద్కర్‌ని దేవుడని కొలుస్తూ స్మరిస్తూ... ఆయన విగ్రహానికి నిలువెత్తు దండలు వేస్తూ స్తుతిస్తూ... ఇంకా హరిజనులను అంటరానివారని దూరంగా వుంచటం.. అవమానించటం... అగౌరవపర్చటం... హేయమైన చర్య కాదా?

నాలో ఎన్నో ప్రశ్నలు నన్ను అనుక్షణం కలవర పరుస్తూనే వుంటాయ్.

★★★★★

మా అంకుల్ నన్ను రాజకీయ రంగ ప్రవేశం చేయమని వత్తిడి చేస్తుంటే సరేనని తలూపాను. పార్టీ టిక్కెట్టు ఇప్పించాడు.

నా సత్తా నిరూపించుకోవటానికి మాత్రమే నేను ఐ.ఏ.ఎస్. పాసైనాను. పోస్టింగ్ ఇచ్చినా నిరాకరించి రాజకీయాల్లోకి అడుగు పెట్టాను.

ఎన్నికల్లో శాసన సభకి పోటీచేసి అత్యధిక మెజారిటీతో గెలిచాను. అనేక మంది హరిజనులు నా వెనుక నిలిచారు. గెలిపించారు.

ఉన్నత విద్య అభ్యసించిన యువకుడిని కావటంతో నన్ను మంత్రి పదవి వరించింది.

పార్టీ సిద్ధాంతాలను అవగతం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగ సాగిపోవాలన్నదే నా ధ్యేయం.

నేను అగ్ర కులంలో జన్మించినవాడినైనా హరిజనోద్ధరణే నా సంకల్పం! వారికి సమాజంలో సమానత్వం కల్పించాలనేదే నా ఆశయం!

మంత్రి పదవి చేపట్టగానే నేను మా అంకుల్ వాళ్ల వూరెళ్లాను. నేరుగ కార్లో హరిజన వాడ చేరుకున్నాను. అక్కడి వారంతా నన్ను గుర్తించారు. వారి ముఖాల్లో ఆనందం... సంతోషం... తృప్తి నన్ను కదిలించింది. వారి సరసనే కూర్చుని సహపంక్తి భోజనం చేసాను. జొన్నరొట్టె...పాయసంతో తృప్తిపడ్డాను. ఆ రాత్రికి వారి మధ్యనే కటిక నేలపై పడుకున్న నన్ను చూచి గ్రామ పెద్దలు.. అధికారవర్గం ఆశ్చర్యపోయారు... అసహ్యించుకున్నారు.

హరిజనులకు పక్కాఇళ్లు నిర్మించమని తారు రోడ్లు వేయించమని... మంచి నీటి చెరువు

నుండి పైప్‌లైన్లద్వారా హరిజనవాడకు తాగునీటి సదుపాయం కల్పించమనీ, హరిజన వాడలో వీధి కరెంట్ దీపాలు ఏర్పాటు చేయమనీ నా వెంటనున్న అధికారులకు అదేశాలివ్వటం చూచి అక్కడి వారంతా చప్పట్లు చరిచారు.

★★★★★

మా అంకుల్ వూళ్లో గల వేణుగోపాల స్వామి వారి కళ్యాణోత్సవం సంగతి నాకు ముందుగా గుర్తుకు రావటంతో... అనుచరులతో... అధికార బృందంతో ఆ వూళ్లో మకాం వేసాను.

నాకు ఆ వూరితో సగం అనుబంధాన్ని అక్కడి పెద్దలకు వివరించాను. ఊరి పెద్దలందరితో హరిజనుల ఆలయ ప్రవేశం గురించి ప్రశాంత వాతావరణంలో సుదీర్ఘంగ చర్చించాను.

నా ప్రతిపాదన వూరి వారు అంగీకరించినందుకు నేనెంతో ఆనందించాను. వారి పెద్ద మనసుకి నా కృతజ్ఞతలు తెల్పుకున్నాను. అగ్రకులాల వారిని వప్పించగలిగేననే తృప్తి నాకు కలిగింది!

స్వామివారి కళ్యాణోత్సవం తిలకించటానికి హరిజన వాడంతా తరలి వచ్చింది. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు వారి బందోబస్తు నడుమ హరిజనులంతా గోవింద నామస్మరణ చేస్తూ వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలోకి అడుగు పెట్టి భక్తి శ్రద్ధలతో దేవుని సేవించు కోవటం చూచి నా మేను పులకించింది.

హరిజనులు కూడా అగ్ర కులాల వారితో మమేకమై స్వామివారి రథాన్ని లాగి ఎనలేని ఆనందానుభూతికిలోనైనారు.

ఈ ఏడు రథయాత్ర హరిజన వాడ వరకూ సాగటం మరో విశేషం!

హరినామ సంకీర్తనలతో గ్రామం మార్మోగింది! గోవింద నామ స్మరణతో దద్దరిల్లింది!! ఆవూరి గోవిందుడు దళితులకు దగ్గరయ్యాడు.

హరిజనుల గోవింద నామ స్మరణతో నామేను పులకించింది. నేనూ వారిలో ఒకడినై స్వామిని సేవించి నా వంతు కర్తవ్యం సఫలీకృతమైనందుకు... తనకా శక్తిని ప్రసాదించిన ఆ దేవునికి నమస్కరించాను.

మరోజన్మంటూ వుంటే.. హరిజనుడినైపుట్టి అంబేద్కర్ అంతటి గొప్పవాడినై ...నిమ్నకులాల వారి సేవలకి నా జీవితాన్ని అంకితం చేసుకోవాలనే నా సంకల్పాన్ని సఫలం చేయమని వేణుగోపాలస్వామిని మనసారా వేడుకున్నాను.

మా అంకుల్ నా భుజం తట్టి తనివితీరా కౌగిలించుకుని... కారు సాగిపోతూంటే నాకు 'బై' చెప్పాడు.

-:(సమాప్తం):-